
సాక్షి
బాపట్ల
మంగళవారం । 10 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2813 టీఎంసీలు. ఎగువ నుంచి 1,580 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1,016 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 813 క్యూసెక్కులు వదిలారు.

కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటీ నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీలో విశ్రాంత ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10 గంటలకు విశ్రాంత ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో ''విశ్రాంత ఉపాధ్యాయ సంక్షేమం–ప్రభుత్వ బాధ్యతలు'' అనే అంశం పై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘ రాష్ట్ర అడ్‌హాక్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీఎస్ మణి, బి.కాశీవిశ్వేశ్వర రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సులో ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు. టి.కల్పలత, మాజీ ఎమ్మెల్సీలు గాదె శ్రీనివాసుల నాయుడు, ఏఎస్ రామకృష్ణ, ఖజానా శాఖ డైరెక్టర్ ఎస్.మోహనరావు, ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఎంప్లాయీస్ హెల్త్‌కేర్ అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. అలాగే గుంటూరు, పల్నాడు జిల్లాల డీటీఓలు, ట్రెజరీ అసోసియేషన్ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. సదస్సు అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని తెలిపారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



బాపట్ల: జిల్లాలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేసే శకటాలు, స్టాల్స్‌ను, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలకు హాజరయ్యే వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో అన్ని మండల, గ్రామ పంచాయతీ స్థాయిల్లో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, మత్స్య శాఖ జేడీ సురేష్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసాద్, సీపీఓ భరత్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయమ్మ, డీఎస్ఓ వీలీమ్స్, డీఎం శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 577.40 అడుగుల వద్ద ఉంది. ఇది 275.5168 టీఎంసీలకు సమానం. కుడి కాలువకు 9,567, ఎడమ కాలువకు 7,852, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,642, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరద కాలు వకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మొత్తం ఔట్‌ఫ్లోగా 53,781 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి వచ్చే నీటిచేరిక పూర్తిగా నిలిచిపోయింది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 852.80 అడుగుల వద్ద ఉంది. ఇది 86.2942 టీఎంసీలకు సమానం.

జోరుగా మిర్చి క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా సోమవారం రైతులు 67,563 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 58,741 బస్తాల విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యంగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. అందుకే రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకు వస్తే ఆశించిన ధర వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.28,000 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.27,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,800 నుంచి రూ.22,000 వరకు ధర పలికింది.

అతుకుల బతుకులు



కొప్పెరపాడులో పరదా పట్టలు తయారు చేస్తున్న కార్మికులు

- కొప్పరపాడు, అద్దంకిల్లో పరదా పట్టల తయారీ యూనిట్లు
- ఏడు నెలలు ఇతర రాష్ట్రాలకు వలసలు
- 1500 కుటుంబాలు జీవనం



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన పరదా పట్టలు

బల్లికురవ: వారు పరదా పట్టల తయారీ వృత్తినే నమ్ముకున్నారు.. రైతులు పండించిన పంటలను నూర్పిళ్లు చేసేందుకు అవసరమైన పరదా పట్టలు రాష్ట్రంతో పాటు పరాయి రాష్ట్రాల్లో అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నారు. బాపట్ల జిల్లా బల్లికురవ, అద్దంకి, మార్టూరు మండలాల్లో సుమారు 1500 కుటుంబాలు జీవనం వెళ్లదీస్తున్నాయి. బల్లికురవ మండలం వేమవరం, కొప్పరపాడు, కొత్తూరు పంచాయతీలోని అరుణగిరితండా, మార్టూరు సమీపంలోని తండాకు చెందిన సుగాలీలతో పాటు అద్దంకి పరిసర గ్రామాల్లోని ఎరుకుల కుటుంబాలు ఐదు దశాబ్దాలుగా పరదా పట్టలు అద్దెలకిస్తుంటారు. నవంబర్ మొదటివారం నుంచి మే ఆఖరు వరకు పరాయి రాష్ట్రాలోనే జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. వీరిలో సొంత భూములు ఉన్న వారిని వేళ్లమీద లెక్కించవచ్చు. గతంలో సుగాలీలు తమ ఆవుల మందలను సుదూర ప్రాంతాల్లోని మాగాణి భూముల్లో వరి నూర్పిళ్లకు తోలుకెళ్లేవారు. ఆధునిక యంత్రాల రాకతో ఆవులతో వరి నూర్పిళ్లు అంతరించిపోయాయి.

పిల్లలను విడిచి వలసలు

కుటుంబాలలోని పెద్దలైన తల్లిదండ్రులకు తమ బిడ్డల ఆలననా పాలన బాధ్యతను అప్పగించి వలసలు వెళ్తారు. 10 నుంచి 15 పరదాలను ఒక కట్టగా కట్టుకుని 250 నుంచి 300 పరదాలతో ఐదు నుంచి ఆరు కుటుంబాలు లారీ బాడుగకు మాట్లాడుకుని నూర్పిడికి అద్దెకిచ్చేందుకు ఎంపిక చేసుకున్న ప్రాంతానికి వెళ్తారు. పరదాలు అద్దెకిచ్చే ప్రాంతంలోనే గుడారాలు ఏర్పాటు చేసుకుని బసచేస్తాయి. ఒక్కో కుటుంబం రూ.1.2 లక్షల నుంచి రూ.1.5 లక్షల పెట్టుబడితో పరదాలు తీసుకొని వెళ్తే పెట్టుబడులు పోను రూ.80 వేల నుంచి రూ.లక్ష ఉంటాయని సుగాలీ కుటుంబాలు 'సాక్షి'కి తెలిపాయి.

ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు...

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి. తెలంగాణ రాష్ట్రంలోని ములుగు, నిజామాబాద్, అదిలాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్, సింధనూరు, గుల్బర్గా, హుబ్లీ, ధావణగేరి, బళ్లారి, తమిళనాడులోని మధురై, ఈరోడ్ మహారాష్ట్రలోని నాగపూర్, శని సింగపూర్ ప్రాంతాలకు వలస వెళ్తారు.

కొప్పెరపాడు, అద్దంకిలో ఐదు యూనిట్లు

కొప్పరపాడు, అద్దంకిలో పరదాల తయారీ చేసే యూనిట్లు ఐదు ఏర్పాటు చేశారు. ఇవి కుటీర పరిశ్రమలా సంవత్సరంలో 365 రోజులు పనిచేస్తుంటాయి. ఆంధ్రలోని నరసరావుపేట, తెనాలి, కాకినాడ, తమిళనాడు ప్రాంతాల నుంచి యూనిట్ల యజమానులు ఖాళీ గోతాలు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.15 చొప్పున కొనుగోలు చేస్తుంటారు. అదేవిధంగా టన్ను రూ.15 వేల నుంచి 20 వేలుకు కొనుగోలు చేస్తారు. గోతాలను శుభ్రపరిచి 25 నుంచి 30 గోతాలతో పరదా తయారు చేస్తారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలోని సుగాలీలు, ఎరుకల కుటుంబాలు పరదా ఒక్కొక్కటి రూ.350 నుంచి రూ.400 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌లో 20 నుంచి 25 మంది వరకు వివిధ ప్రాంతాలకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు.

అద్దెకిస్తూ జీవిస్తున్నాం..



పరదా పట్టలు అద్దెకిస్తూ ఏడు నెలలు పరాయి రాష్ట్రాల్లోనే మకాం ఉంటూ జీవనం వెళ్లదీస్తున్నాం. అతివృష్టి, అనావృష్టితో పంటలు సక్రమంగా పండక ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో గిరాకీ తగ్గింది. సీజన్‌ల వారీగా తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక వెళ్తాం. కాబట్టి ఇబ్బందులు ఉండవు.

– మూడావత్ బాలకృష్ణ నాయక్, వేమవరం

అలవాటు పడిన వృత్తినే నమ్ముకున్నాం..



తండ్రి నుంచి పరదా పట్టలు అద్దెకిస్తూ అలవాటు పడిన వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. పెట్టుబడి సొమ్ము వడ్డీ వ్యాపారుల వద్ద తేవటం వల్ల ఆదాయం తగ్గుతోంది. బ్యాంకులు తమకు రుణాలు అందజేస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

– భూక్యా సునీల్ నాయక్, వేమవరం

30 ఏళ్లుగా పరదా పట్టలు తయారు చేస్తున్నాం..



30 ఏళ్లుగా పరదా పట్టలు తయారుచేసివిక్రయిస్తున్నాం. 15 కుట్టుమిషన్లతోపాటు 20 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నాం. సంవత్సరం పొడవునా నిరంతరంగా పరదాలే తయారుచేస్తూ ఉన్నాం. ఇటీవల యంత్రాల వినియోగం పెరగటంతో ఆర్డర్లు రావటం లేదు.

– యర్రా మునలయ్య, కొప్పెరపాడు

ప్రతిభాశీలుర ప్రోత్సాహానికే

ఉపకార వేతనాలు



ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కౌండిన్య ట్రస్టు చైర్మన్ నారాయణ, గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతిరాణా తదితరులు

- కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో గవర్నర్ చేతుల మీదుగా పంపిణీ
- 450 మంది విద్యార్థులకు రూ.18 లక్షల విలువైన చెక్కులు
- ఐఏఎస్ అకాడమీ భవనం ప్రారంభోత్సవం

పెదకాకాని: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్నట్టు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ ఈవీ నారాయణ అన్నారు. పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 450 మంది విద్యార్థులకు 18 లక్షల రూపాయల నగదు స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేశారు. కౌండిన్య ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 17వ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ చదువులో రాణిస్తున్న విద్యార్థులను మరింత పోత్సహిస్తూ గత 17 ఏళ్లగా స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ట్రస్టు నిర్వహణకు రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు ప్రకటించడం శుభసూచికమన్నారు. అలాగే క్లర్క్ నుంచి సివిల్స్ ఉద్యోగాల వరకూ పోటీ పరీక్షలు రాసే విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనాన్ని గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. చదువుకున్న విద్యార్థులను ఉద్యోగాలు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ అకాడమీ కృషి చేస్తుందన్నారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, కౌండిన్య ఐఏఎస్ అకాడమికీ మూల స్తంభాలుగా నిలిచిన దాతలను కొనియాడారు. ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను పలువురు ప్రముఖులు కొనియాడారు. అనంతరం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీని ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా విద్యార్థులు తరలి వచ్చి ప్రతిభా స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. కార్యక్రమంలో గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ తాతా కాంతిరాణా, గుంటూరు ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్, విశ్రాంత కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ వై.సత్యనారాయణ, ట్రస్టు ప్రతినిధులు వాకా రాంగోపాల్‌గౌడ్, జల్లెడ శ్రీనివాసరావు, వడ్డెంగుంట సుబ్బారావు, పాండి శివన్నారాయణ, బెల్లంకొండ సదాశివరావు, పీతా సుబ్బరామయ్య, పామర్తి సాంబశివరావు, ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, తహసీల్దార్ పి.రత్నం, ఎంపీడీఓ బి.వి.మల్లేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

కన్న కొడుకే కడతేర్చాలని చూస్తున్నాడు

మాకు నలుగురు సంతానం. 10 సెంట్ల ఇంటి నివేశన స్థలాన్ని తన పేరుపై రాయాలని నా రెండవ కుమారుడు నాగరాజు, ఆయన భార్య పద్మావతి, కుమారుడు శివకుమార్‌లతో కలసి తరచూ మాపై దాడి చేస్తున్నాడు. ఇదేమని అడిగినందుకు తల్లిదండ్రులమని కూడా చూడకుండా వృద్ధాప్యంలో ఉన్న మమ్ములను చంపేందుకు ప్రయత్నిస్తున్నాడు. మమ్ములను ఎలాగైనా మీరే కాపాడాలమ్మ..

– మునగపాటి వరదరాజులు, అనుమాయమ్మ ఈపూరుపాలెం, చీరాల మండలం



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మునగపాటి వరదరాజులు..అనుమాయమ్మ దంపతులు

- స్పందనలో తల్లిదండ్రుల ఆవేదన
- అండగా ఉంటామంటూ భరోసానిచ్చిన జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్

బాపట్లటౌన్: కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సమస్యలు వెలువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు నేరుగా జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులులను కలసి తమ సమస్యలు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

ఇంటిని అక్రమించుకొని నన్ను.. నా భర్తను గెంటేశారు

మాకు ఇద్దరు పిల్లలు. నా భర్త అనారోగ్యంతో బాధపడుతుంటాడు. 2015లో నా మరిది పిల్లి నాగేశ్వరరావు నాపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అప్పట్లో ఆయన చెరలు భరించలేక పోలీస్ స్టేషన్‌లో కేసుపెట్టాను. దానిని మనసులో పెట్టుకొని నా బావ ఐజాక్‌తో కలిసి నన్ను, నా భర్త, పిల్లలను ఇంటి నుంచి గెంటేశారు. ఇంట్లోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. వారి చెర నుంచి మమ్ములను కాపాడి నా ఇల్లు నాకు అప్పగించేలా చూడండమ్మా..

– పిల్లి మరియమ్మ, రాచపూడి, కొరిశపాడు మండలం

మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయటం లేదు

నా భార్య ఝాన్సీరాణి 2022 నవంబర్ 1న మెదడు జబ్బుతో చనిపోయారు. అప్పటి నుంచి మరణ ధ్రువీకరణ పత్రం కోసం చీరాల మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు సరిగా సమాధానం చెప్పడం లేదు. గతంలో స్పందనకు వచ్చిన సమయంలో వెంటనే ఇస్తామని చెప్పారే కానీ ఇవ్వడం లేదు. లంచాలు ఇస్తే మరణ ధ్రువీకరణ పత్రం ఇస్తామంటున్నారు. ఇదేమని అడిగితే అసలు నీవు ఆమె భర్తవేనా అంటూ ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు.

– పేర్లి బుజ్జిరాజు, శృంగారపేట, చీరాల పట్టణం

పాఠశాల స్థలాన్ని కొడుకు పేరుతో రిజిస్ట్రేషన్ చేశారు

జిల్లా పరిషత్ హైస్కూల్ చెందిన స్థలాన్ని 10 ఏళ్ల కిందట గ్రామంలోని ప్రజలమంతా చందాలు వసూలు చేసుకొని గ్రామంలోని రహీంతున్నీసా, షాన్‌బీల దగ్గర 9.50 సెంట్లు కొనుగోలు చేసి అప్పటి విద్యాకమిటీ చైర్మన్ అబ్జలున్నీసా పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాం. రెండు నెలల కిందట ఆ స్థలాన్ని తన కొడుకు పేరుతో రిజిస్ట్రేషన్ చేసి ఈ స్థలం మాది అంటూ దౌర్జన్యం చేస్తున్నారు. పాఠశాల స్థలాన్ని దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి.

– గ్రామస్తులు, చినమట్లపూడి, నగరం మండలం

భూమిలో అడుగుపెడితే చంపుతామంటున్నారు

నాకు గ్రామంలో 298 ఖాతా నెంబర్‌లో 53 సెంట్లు భూమి ఉంది. మా గ్రామానికి చెందిన వెనిగళ్ల పిచ్చయ్య, నిమ్మగడ్డ త్రినాథ్‌లు నా పొలాన్ని కబ్జాచేశారు. నేను వృద్ధురాలిని వారితో పోటీ పడలేకపోతున్నాను. పొలంలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు. వారి బారి నుండి నా పొలాన్ని కాపాడండి

– నూతక్కి అనసూర్యమ్మ, దోనేపూడి, కొల్లూరు మండలం

వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించండి

జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ హనుమంతరావు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి హనుమంతరావు

సాక్షి ఎఫెక్ట్

బాపట్లటౌన్: పశువుల్లో లంపీ స్కిన్ వైరస్ (ముద్ద చర్మ వ్యాధి) లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు తెలిపారు. ఈనెల 8న సాక్షిలో 'మూగ రోదన.. మరణ వేదన' శీర్షికతో ప్రచురితమైన కథనానికి పశువైద్యాధికారులు స్పందించారు. మండలంలోని మరుప్రోలువారిపాలెంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేసి గ్రామంలోని తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, కోడిదూడలు, పెయ్యిదూడలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. విజయవాడకు చెందిన వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, గుంటూరుకు చెందిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలకు చెందిన టెక్నికల్ సిబ్బంది పశువుల నుంచి రక్తం నమూనాలు సేకరించారు. డాక్టర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ లంపీ స్కిన్ వైరస్ (ముద్ద చర్మ వ్యాధి) ఒక జంతువు నుంచి మరో జంతువుకు త్వరితగతిన వ్యాప్తి చెందుతుందని అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న పశువులను దూరంగా కట్టివేయాలన్నారు. పశువైద్యశాలల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయని పశుపోషకులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియుడి మోసం.. వివాహిత ఆత్మహత్య

- పెళ్లిపేరుతో సహజీవనం
- రహస్యంగా మరో మహిళతో పెళ్లి
- మనస్తాపంతో ప్రియురాలి బలవన్మరణం
- అద్దేపల్లిలో ఉద్రిక్త వాతావరణం
- యువకుడిని శిక్షించాలని డిమాండ్
- నాలుగున్నర గంటల సేపు నిలిచిన వాహనాలు



అద్దేపల్లి దళితవాడ వాసులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు (ఇన్‌సెట్‌లో) మృతురాలు కనపర్తి శ్రావ్య (ఫైల్)

భట్టిప్రోలు: పెళ్లి పేరుతో ప్రియుడు మోసం చేశాడని మనస్తాపం చెందిన ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన కనపర్తి శ్రావ్యకు పదేళ్ల క్రితం పెళ్లయింది. ఈమె భర్త నుంచి విడాకులు తీసుకుని విడిగా ఇద్దరు చిన్న కుమారులతో కలిసి ఉండేది. ఈ నేపథ్యంలో అద్దేపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి గాలి కిరేష్‌తో పరిచయమైంది. అది సహజీవనానికి దారి తీసింది. విజయవాడలో ఒక అపార్ట్‌మెంట్‌లో కాపురం పెట్టారు. ఈ నేపథ్యంలో శ్రావ్యకు తెలీకుండా ఐదునెలల క్రితం కిరేష్ యాజలికి చెందిన మేనత్త కూతురిని రహస్యంగా పెళ్లి చేసుకున్నాడు. ఆమెనూ విజయవాడలో మరో అపార్ట్‌మెంట్‌లో ఉంచాడు. ఈ విషయం శ్రావ్యకు తెలియడంతో ఇటీవల ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. ముగ్గురం కలసే ఉందామని పెద్దల సమక్షంలో అతను శ్రావ్యకు నమ్మబలికాడు. కిరేష్ మోహంలో పడిన శ్రావ్య తన మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్న సమయంలో భరణం ద్వారా వచ్చిన నగదు రూ.6 లక్షలు, బంగారు ఆభరణాలను అతడికి ఇచ్చింది. ఇటీవల శ్రావ్య గర్భిణి కావడంతో వీరిద్దరి మధ్య మళ్లీ కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో శ్రావ్య గత శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. దీంతో ఆమెను విజయవాడ జీజీహెచ్‌కు కిరేష్ తరలించాడు. అక్కడి నుంచి ఆమెను ప్రైవేట్ వైద్యశాలకు తరలించి తన భార్య అని చెప్పి చికిత్స చేయించాడు. విషయాన్ని శ్రావ్య అమ్మ, సోదరునికీ సమాచారం ఇచ్చాడు. ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని తీసుకునేందుకు కిరేష్ రాకపోవడంతో అద్దేపల్లి నుంచి సంఘ పెద్దలు వెళ్లి అతడిని నిలదీయగా ఆమెకు అంత్యక్రియలు చేయాల్సిన అవసరం తనకు లేదని, ఆమె నా దగ్గరకు వచ్చి సహజీవనం చేసిందని బదులిచ్చాడు. మృతదేహాన్ని ఆదివారం రాత్రి సంఘ పెద్దలు, అద్దేపల్లి దళితవాడ వాసులు అద్దేపల్లిలోని కిరేష్ ఇంటికి తీసుకువచ్చి అక్కడే ఉంచి న్యాయం చేయాలని పట్టుబట్టారు. కిరేష్ కుటుంబ సభ్యులు పత్తా లేకపోవడంతో వారు ఆదివారం రాత్రి భట్టిప్రోలు పోలీసులను ఆశ్రయించారు. విజయవాడలో కేసు నమోదైతే ఇక్కడ మళ్లీ రిపోర్టు ఎలా తీసుకుంటామని పోలీసులు ప్రశ్నించారు.

ఆందోళనకు దిగిన అద్దేపల్లి వాసులు

దీంతో అద్దేపల్లివాసులంతా ఏకమై సోమవారం ఉదయం 10 గంటలకు బాపట్ల–భట్టిప్రోలు రహదారిలోని అద్దేపల్లి అడ్డరోడ్డు వద్ద బైఠాయించారు. న్యాయం చేయాలని నినదించారు. ఎస్ఐ వై.సురేష్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పే యత్నం చేశారు. వాహనాలు హైవే మీదుగా వెళుతుండటంతో అక్కడకు చేరుకుని రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాలు ఇరువైపులా అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. శ్రావ్య కుమారులకు న్యాయం చేయాలని, ఆమెకు కిరేష్ చేతులమీదుగా అంత్యక్రియలు చేయించాలని, అతడి కుటుంబ సభ్యులపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలో తొలుత పోలీసులకు తన భార్య అని చెప్పిన కిరేష్ తర్వాత రిపోర్టును మార్చేశాడని, శ్రావ్య వద్ద నుంచి కిరేష్ తీసుకున్న నగదు, బంగారాన్ని రికవరీ చేయాలని కోరారు. నిందితుడిని తీసుకువచ్చి అంత్యక్రియలు చేయించే వరకు మృతదేహాన్ని అలాగే ఉంచుతామని భీష్మించారు. వేమూరు సీఐ ఎ.వెంకటేశ్వరరావు, కొల్లూరు, వేమూరు ఎస్ఐలు జె.శామ్యూల్ రాజీవ్ కుమార్, చౌడయ్య ఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఎట్టకేలకు నిందితుడు కిరేష్ ఆచూకీ కనిపెట్టి తీసుకొచ్చి అంత్యక్రియలు చేయిస్తామని, శ్రావ్య కుమారులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఆందోళన మధ్యాహ్నం 2:30 గంటల వరకు కొనసాగింది. దాదాపు నాలుగున్నర గంటల సేపు వాహనాలు నిలిచిపోయాయి.

క్లుప్తంగా

వృద్ధ దంపతుల ఆత్మహత్య

అనారోగ్య కారణాలతో పురుగుమందు తాగి..



అద్దంకి: అనారోగ్య కారణాలతో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని గొర్లమిట్టలో సోమవారం జరిగింది. స్థానికులు, బంధువులు అందించిన సమాచారం మేరకు పట్టణంలోని గొరకాయపాలెం (గొర్లమిట్ట)కు చెందిన కట్టా ముసలయ్య (79), వెంకాయమ్మ (70)లకు ఇరువురు కుమారులు. వారందరికీ వివాహాలు కాగా వేరుగా ఉంటున్నారు. నాలుగు పోర్షన్ల సొంత ఇంటిలో వృద్ధ దంపతులు ఒక పోర్షన్‌లో నివసిస్తున్నారు. సమీపంలోని వేరే ఇళ్లలో కొడుకులు ఉంటున్నారు. ఈ క్రమంలో నాలుగేళ్ల కిందట ముసలయ్య భార్య వెంకాయమ్మ కాళ్లు చేతులు చచ్చు పడటంతో మంచానికే పరిమితం అయింది. భార్యకు, తనకు సేవలు చేసేందుకు ఒక పనిమనిషిని నియమించుకున్నారు. ఆమె వారి పనులు చేసి పెడుతూ ఉంది. ఈ క్రమంలో నెల నుంచి ముసలయ్యకు కిడ్నీ సమస్య వచ్చి ఒంటికి నీరు చేరింది. ఇటీవల ఓ ప్రైవేటు వైద్యశాలలో వైద్యం కోసం వెళ్లి పరీక్షలు చేయించుకుని వచ్చాడు. ప్రతిరోజూ పనిమనిషి వచ్చి పనిచేసి రాత్రికి ఇంటికి వెళుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరికి అన్నం పెట్టి పనిమనిషి ఇంటికి వెళ్లింది. సోమవారం ఉదయం వచ్చి తలుపులు వేసి ఉండడంతో పిలిచింది. ఎంత పిలిచినా పలకకపోవడంతో తలుపు తెరచి లోపలకు వెళ్లింది. లోపల ఇద్దరూ విగత జీవులై మంచాలపై పడి ఉండడంతో ఉలిక్కిపడి వారి బంధువులకు తెలియజేసింది. సమాచారం పోలీసులకు తెలియడంతో ఎస్సై సమందర్‌వలి, సీఐ రాజమోహన్‌రావు సంఘటన జరిగిన ఇంటికి వెళ్లి విచారణ చేశారు. పురుగుమందును టీ కప్పుల్లో పోసుకుని తాగినట్లు గమనించారు. నాలుగు సంవత్సరాల నుంచి భార్య అనారోగ్యంతో మంచానికే పరిమితం కావడం, తానూ అనారోగ్యం పాలు కావడంతో ఇక బతికి ప్రయోజనం ఏముందని పురుగుమందు తాగి ఇరువురూ ఆత్మహత్య చేసుకుని ఉంటారని బంధువులు భావిస్తున్నారు.

అద్దంకి విద్యార్థికి జగనన్న విదేశీ విద్యాదీవెన

- రూ.20 లక్షలు ఫీజు రీయింబర్స్‌మెంట్
- ఎంపిక పత్రం అందజేసిన శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య



విద్యార్థికి ఎంపిక పత్రం అందజేస్తున్న శాప్‌నెట్ ఛైర్మన్ చైతన్య

అద్దంకి: ప్రతిభ కలిగిన విద్యార్థుల విదేశీ విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన సందిరెడ్డి కొండలరావు కుమారుడు సుఖేశ్ ఎంపికయ్యారు. రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య విద్యార్థి ఇంటికి వెళ్లి అభినందించారు. చైతన్య మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టాప్ ర్యాంకు పొందిన 100 కళాశాలల్లో సీటు పొందిన వారికి ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. సుఖేశ్ కేఎల్ యూనివర్సిటీలో ఐదు సంవత్సరాల లా కోర్సు (ఎల్ఎల్ఎం) పూర్తి చేశాడన్నారు. అమెరికాలోని విస్కాన్సిన్ యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం పీజీ కోర్సు చేసేందుకు సీటు రావడంతో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి ఎంపికయ్యాడని చెప్పారు. మొత్తం రూ.40 లక్షలు ఫీజు కాగా, విద్యార్థికి రూ.20 లక్షల ఉపకార వేతనం పోనూ మిగిలిన రూ.20 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థికి అందజేయనుందని వెల్లడించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నమాట తప్పకుండా పథకాలు అమలు చేస్తున్నాడని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. విద్యార్థి ఈ నెల 11న అమెరికా వెళ్లనున్నాడు. విద్యార్థి సుఖేశ్ మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి తనను ఎంపిక చేసినందుకు సీఎం జగన్‌కు, రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్యకు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాచిన చెంచుగరటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం వలన ఎంతో మంది ప్రతిభ కలిగిన విద్యార్థుల విదేశీ కల నెరవేరుతుందన్నారు.

సచివాలయంలో కంప్యూటర్లు చోరీ

చీరాల: మున్సిపల్ పరిధిలోని రామ్‌నగర్ సచివాలయంలో దొంగలు పడి కంప్యూటర్లు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ పోలీసులకు సచివాలయ ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. సోమవారం ఉదయం సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరుకాగా సచివాలయం తాళాలు పగలగొట్టి గడియపెట్టి ఉంది. ఉద్యోగులు కార్యాలయం లోపలికి వెళ్లగా సచివాలయంలో ఉండాల్సిన రెండు కంప్యూటర్లు అపహరణకు గురయ్యాయి. సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ అధికారులతోపాటుగా టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సచివాలయాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

పోలీసులు కొట్టి సంతకాలు పెట్టించారు

మా కొడుకు వీరబాబుకు 2014లో రేపల్లె ప్రాంతానికి చెందిన ఉషారాణితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రెండేళ్ల కిందట మా కోడలు పుట్టింటికి వచ్చింది. ఆమె ఫిర్యాదు మేరకు నన్ను, నా కొడుకును రేపల్లె సీఐ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొట్టి బలవంతంగా తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించారు. ఏం చేస్తారోనని భయంగా ఉంది.

–శొంఠి వెంకటేశ్వరమ్మ, అంగలూరు, గుడ్లవల్లేరు మండలం, కృష్ణా జిల్లా



ఎస్పీ వకుల్ జిందాల్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

- స్పందనలో బాధితులు ఆవేదన
- అండగా ఉంటామంటూ ఎస్పీ వకుల్‌జిందాల్ భరోసా

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 33 మంది బాధితులు హాజరై తమ సమస్యలు నేరుగా ఎస్పీకు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీసులు పట్టించుకోలేదు

నేను గ్రామంలోని సర్వేనెంబర్ 270లో దేవినేని భాస్కరికి చెందిన రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేస్తున్నా. గోగినేని శేషుబాబు, మరో 15 మంది రౌడీలను తీసుకువచ్చి పంట తగలపెట్టే ప్రయత్నం చేశారు. ఇదేమని అడిగినందుకు నాపై దాడి చేశారు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

–కారుమూరి జ్యోతి, వెల్లటూరు, భట్టిప్రోలు మండలం

చంపాలని చూస్తున్నాడు

నాకు 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. నాకు ఇద్దరు మగపిల్లలు. ఇటీవల నా భర్త నరేష్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని నన్ను ఇంటి నుంచి వెళ్లిపోమని, లేకుంటే చంపుతానని బెదిరిస్తున్నాడు. భయంతో నేను మా పుట్టింటికి వచ్చాను. నా భర్త ఏం చేస్తాడోనని నాకు భయంగా ఉంది.

–నన్నెపాముల విజయలక్ష్మి, ధూళిపూడి, నగరం మండలం

నా భర్త రెండో పెళ్లి చేసుకున్నాడు

నాకు 17 ఏళ్ల కిందట బాపట్ల పట్టణం డ్రైవర్స్ కాలనీకి చెందిన షేక్ ఖాశింతో వివాహం జరిగింది. నాకు ఇద్దరు పిల్లలు. నా భర్త నిత్యం వేధిస్తుంటే ఇటీవల నేను మా పుట్టింటికి వెళ్లాను. నాకు తెలియకుండా నా భర్త మరో మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇదేమని అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు.

– షేక్ ఖాశింబీ, ఎల్‌బీఎస్ నగర్, చీరాల పట్టణం

సంస్కృతీ సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీక

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



బహుమతులు అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఎడ్ల పందేలు ప్రతీకని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. కంప్యూటర్ యుగంలో ఇవి సజీవంగా ఉండాలని, అందుకు ఇలాంటి పోటీలు నిర్వహించటం ముదావహమని చెప్పారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర–తూములూరు గ్రామాల మధ్య ప్రత్యేక ప్రాంగణంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి, అన్నాబత్తుని సత్యనారాయణ, గుదిబండి వెంకటరెడ్డి మెమోరియల్ ఒంగోలు జాతి వృషభరాజముల బండలాగు డు బలప్రదర్శన పోటీలు చివరిరోజైన సోమవారం సీనియర్స్ కేటగిరీలో పోటీలను మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి తిలకించారు. ముందు రోజు రాత్రి పొద్దుపోయేవరకు జరిగిన జూనియర్స్ కేటగిరీలో జరిగిన పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను ఆయన బహూకరించారు. ఆయన మాట్లాడుతూ రైతువారీ వ్యవస్థకు అనుసంధానమైన ఎడ్ల పందేలు కొనసాగించాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. లేకుంటే చరిత్రను మరిచిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ వీటి నిర్వహణ బాధ్యతను భుజాలపై వేసుకుని, పెద్దలందరి సహకారంతో నిర్వహించటం ముదావహమన్నారు. భాగస్వాములైన అందరికీ అభినందనలు తెలియజేశారు. జూనియర్స్ కేటగిరీలో బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి–శివకృష్ణ చౌదరిల ఎడ్ల జత అత్యధిక దూరం బండ లాగి విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి కింద రూ.80 వేల పారితోషికాన్ని అందుకున్నారు. అత్తోట శిరీష చౌదరి–శివకృష్ణచౌదరి, బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన పోపూరి శ్రీనివాసరావుల ఎడ్ల జత ద్వితీయ బహుమతిని గెలిచి రూ.70 వేల నగదు బహుమతిని అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన డి.రోహన్‌బాబు ఎడ్ల జత తృతీయ బహుమతిని గెలిచి రూ.60వేల నగదును అందజేశారు. కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్‌రావు ఎడ్ల జతకు నాలుగో బహుమతి లభించింది. ఈ విభాగంలో మొత్తం 10 ఎడ్ల జతలకు వరుసగా నగదు బహుమతులను అందజేశారు. సీనియర్స్ విభాగంలో పోటీలను కొల్లిపర పాల సొసైటీ అధ్యక్షుడు నెర్ల కుటుంబరెడ్డి, ఈమని హరికోటిరెడ్డి ప్రారంభించారు. రెండు తెలుగు రాష్ట్రాల్నుంచి 13 ఎడ్ల జతలు వచ్చాయి. రాత్రి పొద్దుపోయేవరకు పోటీలు కొనసాగాయి. అల్లం బాపిరెడ్డి, అవుతు హర్షవర్ధనరెడ్డి, చెంచల రామిరెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈదా హర్షవర్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, కొల్లిపర సర్పంచ్ పిల్లి రాధిక, ఎంపీటీసీ చిలువూరు ఝాన్సీ, కేసని శ్రీలత, ఎంపీటీసీ మర్రెడ్డి మాధవి, నెర్ల కుటుంబరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, ఎస్‌ఐ రవీంద్రరెడ్డి, బొంతు వేణుగోపాలరెడ్డి, అడపా నారాయణరెడ్డి, జొన్నల శివారెడ్డి, బి.శివకోటిరెడ్డి పాల్గొన్నారు.

పాలకవర్గం తీర్మానం మేరకే పనులు చేపట్టాలి

పిట్టలవానిపాలెం: గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించి తీర్మానం మేరకు గ్రామాభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ ఇన్‌చార్జి అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని భవనంవారిపాలెం గ్రామపంచాయతీలో పలు అంశాలపై అందిన ఫిర్యాదు మేరకు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, గ్రామ కార్యదర్శి వసుంధర లక్ష్మి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడం లేదనే విషయంపై ఆరా తీశారు. గ్రామ సచివాలయం భవనం నిర్మాణం చేపట్టిన వారికి బిల్లు పెండింగ్‌లో ఉందని, ఇందుకు సంబంధించిన ఎం.బుక్ రికార్డులు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే పంచాయతీరాజ్ ఏఈ నుంచి లెటర్ తీసుకుని బిల్లు చెల్లించాలని ఆదేశించారు. గ్రామంలో డంపింగ్ షెడ్డు నిర్మాణం కోసం గ్రామపంచాయతీ అకౌంట్‌లో రూ.లక్షా 10 వేలు జమ చేశామని, షెడ్డు నిర్మాణం చేపట్టనందున ఆ నగదును తిరిగి చెల్లించాలని సూచించారు. వారి వెంట బాపట్ల డివిజన్ డీఎల్‌పీఓ శరత్‌బాబు, ఎంపీడీఓ కొల్లిపర పద్మజ, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1300, గరిష్ఠ ధర రూ.1900, మోడల్ ధర రూ.1600 వరకు పలికింది.